సాక్షి విజయనగరం

శుక్రవారం ၊ 25 ၊ ఆగస్టు ၊ 2023



మార్మోగిన జగన్నామస్మరణ

పార్వతీపురంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభకు జనం పోటెత్తారు. - IIలో



12,653 మందికి రూ.57.9 కోట్ల లబ్ధి

నవరత్నాలు కింద చివరిగా విజయనగరం జిల్లాలోని 12,653 మందికి రూ.57.98 కోట్ల మేర లబ్ధి చేకూరింది. - IIలో



చదువుకున్న బడి బాగుకు ఒకనెల వేతనం వితరణ

ఓ ఉపాధ్యాయుడు తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఒక నెల వేతనం వితరణగా అందజేశారు. - IIలో

శ్రావణ మార్కెట్



శ్రావణమాసం రెండో శుక్రవరం నిర్వహించే వరలక్ష్మీ వ్రతాలకు అవసరమైన పూజాసామగ్రి కొనుగోలుదారులతో జిల్లాలోని మార్కెట్‌లన్నీ గురువారం రద్దీగా మారాయి. పండ్లు, పూలు, బంగారు దుకాణాలు జనంతో సందడిగా కనిపించాయి. ఇదే అదునుగా వ్యాపారులు పూజాసామగ్రి ధరలను అమాంతం పెంచి విక్రయించారు.

– విజయనగరం టౌన్

నేడు ముఖ్యమంత్రి జగన్ రాక

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన
- చినమేడపల్లి, మరడాం వద్ద ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీసీఎం రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ
- సీఎం ప్రోగ్రామ్స్ కన్వీనర్ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పర్యవేక్షణ
- జిల్లా ఉన్నతాధికారులంతా ఏర్పాట్లలో తలమునకలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లా పర్యటనకు శుక్రవారం రానున్నారు. సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ) నిర్మాణానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం సాయంత్రం పరిశీలించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కూడా మరడాం వద్ద బహిరంగ సభా ఏర్పాట్లను చూశారు. ప్రజాప్రతినిధులతో చర్చించారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కన్వీనరు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వారం రోజులుగా ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితర ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయిలోనే ఉంటూ ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయిస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్య శాఖ కార్యదర్శి జె.శ్యామలరావు ఈ ఏర్పాట్లను పరిశీలించారు.

పర్యటనలో స్వల్ప మార్పు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దత్తిరాజేరు మండలంలో మరడాం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకోవడానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మెంటాడ మండలం చినమేడపల్లి వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. భద్రతా కారణాల రీత్యా స్వల్ప మార్పు చేశారు. చినమేడపల్లి వద్ద మరో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ విశాఖపట్నం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో నేరుగా అక్కడికి చేరుకుంటారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన, శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం మళ్లీ హెలికాప్టర్‌లో మరడాం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. బహిరంగసభ అనంతరం షెడ్యూల్ ప్రకారం అక్కడి నుంచే విశాఖపట్నం విమానాశ్రయానికి హెలికాప్టర్‌లో తిరిగి ప్రయాణమవుతారు.

క్లుప్తంగా

టీడీపీలో 'కోళ్ల' కలకలం



జామిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

జామి: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి పార్టీలో కలకలం సృష్టిస్తున్నారని ఆ పార్టీ జామి మండలాధ్యక్షుడు లగుడురవికుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారుపెదబాబు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు రెడ్డిపైడిబాబు తదితరులు ఆరోపించారు. జామిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లలితకుమారి పార్టీని బలహీనపరిచేలా ప్రవర్తిస్తున్నారన్నారు. గ్రామాల్లో గ్రూపురాజకీయాలకు తెరతీశారన్నారు. కోళ్ల వ్యవహారంపై పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

భోగాపురం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం మధ్యాహ్నం భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామ సమీపంలో జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన కరుణాకరన్ తన సొంత పనుల నిమిత్తం బైక్‌పై ముక్కాం బయల్దేరాడు. ముంజేరు గ్రామ సమీపంలో ఉన్న సచివాలయం వద్దకు చేరుకునేసరికి అంతలో ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఏఎస్సై తవుడు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను విజయనగరం, తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చీపురుపల్లి: స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాకుపై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడని, అతని వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుంద ని, పచ్చ రంగు షర్ట్ ,ఖాకీ రంగుప్యాంటు ధరించి ఉన్నాడని, జేబులో టీప్ ఉందని తెలిపారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 70132 73731 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వాసు

విజయనగరం క్రైమ్: నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామానికి చెందిన పల్లి వాసు (30) బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పల్లి వాసు కొంతకాలం వరకూ ఓఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాసేవాడు. అయితే ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవడం కష్టంగా ఉందని తొమ్మిది నెలల క్రితం ఉద్యోగాన్ని వదిలి విజయనగరంలోని పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న అన్నయ్య సంతోష్ వద్దకు వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయానని, అన్నయ్య సంతోష్ ఉద్యోగం లేక పుస్తకాల వ్యాపారం చేయడం వల్ల వివాహం కాలేదని, తాను కూడా మంచి ఉద్యోగం సంపాదించలేక పోతున్నానన్న మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లోని పూజగదిలో ఉరివేసుకున్నాడు. పుస్తకాల వ్యాపారం పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన సంతోష్ తమ్ముడు ఇంకా రాలేదని భావించి ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంట్లోనే ఉన్నాడేమోనని భావించి వెతకగా పూజ గది తలుపు వేసి ఉండడంతో అనుమానం వచ్చి తలుపులు విరగ్గొట్టి చూసేసరికి ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అలుగోలులో ఉంటున్న తల్లిలక్ష్మికి విషయం చెప్పి, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹ 216

మార్మోగిన జగన్నామ స్మరణ

- సంక్షేమ పథకాలతో కుటుంబ భద్రత
- పార్వతీపురంలో దిగ్విజయంగా పూర్తయిన జీజీఎంపీ
- 76 సచివాలయాల పరిధిలో 78వేల కుటుంబాల సందర్శన
- పార్వతీపురంలో భారీ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశానికి హాజరైన అభిమానులు

పార్వతీపురంటౌన్: ఎల్లప్పుడూ ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పార్వతీపురం నియోజక వర్గంలో గురువారం దిగ్విజయంగా పూర్తయింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజుల అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభ జగన్నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ 2019వ సంవత్సరం ఎన్నికల ముందు ఏదైతే ప్రజలకు హామీ ఇచ్చారో ఆ హామీని 98శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందించడమే కాకుండా గడపగడపకు వెళ్లి మీకు ఈ ప్రభుత్వ పథకం అందిందని తెలియజేస్తూ..ఏవైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటిని సైతం పరిష్కరించేందుకు నిర్వహించిన బృహత్తర కార్యక్రమం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమమన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభించిన 16 నెలల్లో నిర్విరామంగా 275రోజులు నిరాటంకంగా 76 సచివాలయాల పరిధిలో 78వేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి వారి బాగోగులను అడిగి తెలుసుకుని, గ్రామాల్లో వారి సమస్యలు పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకున్నారని చెప్పారు. ప్రభుత్వం అన్ని వర్గాల వారికి మేలు చేసేలా పాలన చేపడుతుంటే చూసి ఓర్వలేని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మూడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బృహత్తర కార్యక్రమం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉంది. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలుగా మార్పుచేశాం. కాంప్లెక్స్ నుంచి ఫ్లై ఓవర్ వరకు ఉన్న బైపాస్ రోడ్డును విశాలంగా మార్చాం. రూ. 50కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం, రూ. 64కోట్లతో పట్టణ ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశాం. రూ.10కోట్లతో పీహెచ్‌సీల ఆధునీకరణ మరెన్నో పథకాలు ప్రారంభించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నాం.

అలజంగి జోగారావు, ఎమ్మెల్యే పార్వతీపురం

ఇది చేతల ప్రభుత్వం



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98శాతం నెరవేర్చి పేదల పక్షాన ప్రభుత్వం నిలిచింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించి సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు సార్థకం చేసుకున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం అభినందనీయం.

పరీక్షిత్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

జీజీఎంపీ ద్వారా మరింత అభివృద్ధి



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి పథంలోకి వెళ్తున్నాయి. పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం అతి తక్కువ కాలంలో దిగ్విజయంగా పూర్తి చేయడం అభినందనీయం.

శోభా హైమావతి, నియోజవకర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు

చదువుకున్న బడి బాగుకు ఒక నెల వేతనం వితరణ

- ప్రభుత్వ పాఠశాలకు రూ.70,576లు అందించిన ఉపాధ్యాయుడు
- అభినందించిన తోటి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



సరస్వతీదేవి సాక్షిగా నగదును సర్పంచ్‌కు, ఉపాధ్యాయులకు అందజేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రమణ

మెరకముడిదాం: తనకు చిన్నతనంలో ఓనమాలు నేర్పించి, తన విద్యోన్నతికి పునాది వేసిన బుదరాయవలస జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, అదే పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న మాడుగుల రమణ ఒకనెల వేతనం 70,576ను గురువారం వితరణగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్ సారిక తమ్మినాయుడుకు నగదు అందజేసి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని కోరారు. తను చదువుకున్న పాఠశాలలో సౌకర్యాలకల్పనకు వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను తోటి ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు.

27న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య 524వ సాహిత్య సదస్సు ఈ నెల 27న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'తెలుగు భాషకు గొడుగు గిడుగు' అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త విశాఖ సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకరరావు వక్తగా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. విజయభావన ప్రత్యేక సలహాదారు డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య సన్మానకర్తగా, ఎం ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రాఘవరావు అధ్యక్షత వ్యవహరిస్తారన్నారు. సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

31 నుంచి ఆదిభట్ల 159వ జయంతి మహోత్సవాలు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159 జయంతి మహోత్సవాలు ఆగస్టు 31, సెప్టెంబరు ఒకటి తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదిభట్ల నారాయణదాస ఆరాధనోత్సవ సంఘం అధ్యక్షులు పివి.నరసింహరాజు(బుచ్చిబాబు) గురువారం ప్రకటనలో తెలిపారు. టీటీడీ ఆధ్యాత్మిక భక్త మండలి వేదికగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. 31న కానుకుర్తివారి వీధిలో ఉన్న దాసు గృహంలో పూజలు , వెన్‌లాక్‌పార్కులో దాసు విగ్రహానికి , సంగీత కళాశాలలో దాసు విగ్రహానికి పుష్పమాలాంకరణ,అనంతరం వేదిక వద్ద కథాగానాలు ఉంటాయన్నారు. ఒకటో తేదీన శుక్రవారం హరికథలు, సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథి కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా మచిలీపట్టణానికి చెందిన మడమల రాంబాబు భాగవతులకు ఆదిభట్ల పురస్కారం అందజేయనున్నామన్నారు. అభిమానులందరూ హాజరుకావాలని కోరారు.

28న మీ వద్దకే పీఎఫ్

విజయనగరం టౌన్: పీఎఫ్ ఖాతాదారులు, పెన్షనర్లు, పీఎఫ్ సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 28న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజయనగరంలోని రింగురోడ్డు సింహాద్రినగర్ , ఫ్లాట్ నంబర్ వన్‌లో ఉన్న ఈఎస్‌ఐ కార్పొరేషన్ కార్యాలయంలోను, పార్వతీపురం మన్యం జిల్లా మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పీఎఫ్ సమస్యలు ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుంబచ్చన్ గురువారం తెలిపారు. విజయనగరం పడాలపేటలో గల ఎపిక్ బ్యాడ్మింటన్ స్టేడియంలో అండర్-11,13,15 వయస్సు విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 91337 73485, 79891 99534 నంబర్లను సంప్రదించాలన్నారు.

12,653 మందికి రూ.57.9 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ రఘురాజు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

విజయనగరం అర్బన్: నవరత్నాల ద్వైవార్షిక నూతన లబ్ధిదారులకు నగదు మంజూరు కార్యక్రమం ద్వారా విజయనగరం జిల్లాలో 12,653 మందికి రూ.57.98 కోట్ల మేర లబ్ధి చేకూరింది. వివిధ సంక్షేమ పథకాలను అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన లబ్ధిదారులకు నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని ఖాతాల్లో జమ జేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ రఘురాజు, గ్రామీణాభివృద్ధి, విద్య, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు, వివిధ ప్రాంతాల లబ్ధిదారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పథకాల లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, బీసీ సంక్షేమ శాఖ అధికారి యశోదనరావు, వివిధ శాఖల అధికారులు, పథకాల లబ్ధిదారులు తదితరులు హాజరయ్యారు.

పథకం	లబ్ధిదారులు	లబ్ధిపొందిన సొమ్ము
జగనన్న అమ్మ ఒడి	645	రూ.96.75 లక్షలు
వైఎస్ఆర్ నేతన్న నేస్తం	1	రూ.24 వేలు
ఈడీసీ నేస్తం	132	రూ.19.80 లక్షలు
జగనన్న చేదోడు	2,360	రూ.23.60 కోట్లు
మత్స్యకార భరోసా	6	రూ.6 వేలు
వైఎస్ఆర్ ఆసరా	408	రూ.82.14 లక్షలు
సున్నావడ్డీ పంట రుణాలు	4,351	రూ.83.71 లక్షలు
ఇతర పథకాల కింద	4,750	రూ.61.34 లక్షలు

గిరిజన విద్యార్థుల్లో విద్యావికాసం



డిప్యూటీ సీఎం రాజన్నదొరతో కలిసి మాట్లాడుతున్న వై.వి.సుబ్బారెడ్డి

దత్తిరాజేరు: పార్వతీపురం(మన్యం)జిల్లా సాలూరు నియోజకవర్గంలో చినమేడపల్లి వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేయనున్న గిరిజన యూనివర్సిటీతో గిరిజన విద్యార్థుల్లో విద్యావికాసం కలగనుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలతో కలిసి మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద ఆవిష్కరించనున్న శిలాఫలకం పనులు, దత్తిరాజేరు మరడాం వద్ద సభావేదికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు స్థల పరిశీలనలు చేయడమే తప్ప వర్సిటీని నిర్మించాలన్న ఆలోచన చేయలేదన్నారు. ముఖ్యమంత్రి కేంద్రంతో మాట్లాడి అన్ని వసతులు ఉన్న ప్రదేశాన్ని చూపించడంతో వర్సిటీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో ఏర్పడిన వెంటనే విజయనగరంలో తాత్కాలిక భవనాల్లో తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుందన్నారు. 561 ఎకరాల్లో సుమారు రూ.840 కోట్ల వ్యయంతో వర్సిటీ నిర్మాణ పనులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

సాలూరు: సాలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలంలోని చినమేడపల్లి సమీపంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు శుక్రవారం ముఖ్యమంత్రితో పాటు కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వస్తున్నారన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్‌చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్లు, శాఖల చైర్మన్‌లు, డైరెక్టర్లు, సభ్యులు, సచివాలయ గృహసారథులు, సమన్వయకర్తలు, పార్టీశ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గణేష్(ఫైల్)

సీతమ్మధార: పార్వతీపురం మన్యం జిల్లా, కొమరాడ మండలం, గంగరేగువలసకు చెందిన దాసరి గణేష్(25) విశాఖపట్నంలో బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. విశాఖపట్నంలోని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామాటాకీస్ దరి ఇంక్రెడ్ ప్రైవేట్ సంస్థలో సేల్స్ ఆఫీసర్‌గా గణేష్ ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఆఫీస్ పని మీద కొరియర్ చేసేందుకు రామా టాకీస్ నుంచి డైమండ్ పార్కు వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పాత తిలక్ షోరూం వద్దకు వచ్చే సరికి గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గణేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌తోపాటు రోడ్డు మీద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108లో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువు ద్వారపురెడ్డి చూడ మణీశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జి సిమ్‌ను సద్వినియోగం చేసుకోండి

- డీజీఎం దాలినాయుడు



డి.దాలినాయుడు, డిప్యూటీ జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, విజయనగరం

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ ఉచిత 4జి సిమ్‌ను వినియోగదారులు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ డీజీఎం డి.దాలినాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే కొంతమంది వినియోగదారులు వారి పాత 3జి సిమ్ ద్వారానే మొబైల్ సేవలు పొందుతున్నారన్నారు. 4జి సాంకేతికతను ప్రారంభించిన తర్వాత 3జి సేవలలో అంతరాయం వచ్చే అవకాశం ఉన్నందున, 3జి వినియోగదారులందరూ తప్పనిసరిగా ఉచితంగా అందజేసే 4జి సిమ్‌ను తీసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించి కార్యాలయం పనివేళల్లో సంప్రదించి సిమ్ పొందవచ్చన్నారు. ప్రస్తుత సిమ్ 3జి లేదా 4జి లో ఉందా అనే విషయాన్ని తెలుసుకోవాలంటే వారి మొబైల్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మెసెజ్ పంపి వెంటనే తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా సెప్టెంబరు 30లోపు కేవైసీ ద్వారా డిజిటలైజ్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 3జి వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న గౌరమ్మ

పార్వతీపురం: బస్సును రివర్స్ చేస్తున్నప్పుడు వెనుక నుంచి ఢీ కొట్టడంతో గురువారం ఓ మహిళకు గాయాలయ్యాయి. గరుగుబిల్లి మండలం వల్లరగుడబ గ్రామానికి చెందిన ఊడుగు గౌరమ్మ అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షల కోసం పార్వతీపురం బయలుదేరి బస్టాండ్‌వద్ద నిరీక్షిస్తున్న సమయంలో పార్వతీపురం నుంచి వల్లరగుడబ వచ్చిన ఆర్టీసీ బస్సును వల్లరగుడబ బస్టాండ్‌వద్ద రివర్స్ చేస్తున్న సమయంలో గౌరమ్మను ఢీకొంది. ఈసంఘటనలో గౌరమ్మ కింద పడిపోగా బస్సు వెనుక టైరు కాలిపైనుంచి వెళ్లింది. దీంతో కాలికి బలమైన గాయమైన కారణంగా స్థానికులు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మజ్జి శ్రీనివాసరావు

- 48 మంది సభ్యులతో పార్టీ నూతన కార్యవర్గం నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా నియామకమైన్న మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నియామకమయ్యారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు జిల్లా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్తగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ ఎన్నికల్లో విజయం సాధించడంలో కీలక భూమిక పోషించిన ఆయనకు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించింది. ఇప్పటికే జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మజ్జి శ్రీనివాసరావుకు మరోసారి అధ్యక్షునిగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా 48 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గ జాబితాను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. నూతన కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యక్షులుగా వత్రి.నర్సింహమూర్తి(గజపతినగరం), రొంగలి పోతన్న (విజయనగరం)లు నియామకమయ్యారు.

- ప్రధాన కార్యదర్శులుగా అంబళ్ల శ్రీరాములనాయుడు (నెల్లిమర్ల), కాకర్ల వీరవెంకట సూర్యనారాయణరాజు (ఎస్‌కోట), కోట్ల వెంకటరావు (చీపురుపల్లి) , తోలేటి.రాజారత్నం (రాజాం), ఇంటి.గోపాలరావు (బొబ్బిలి)లు , కోశాధికారిగా ఎస్.వి.రమణరాజు (చీపురుపల్లి) నియామకమయ్యారు.
- కార్యదర్శులుగా వల్లిరెడ్డి శ్రీనివాసులనాయుడు (చీపురుపల్లి), కూరాకుల సూర్యారావు(ఎస్.కోట), గొట్టుముక్కల శివరామచంద్రవర్మ (గజపతినగరం), రెడ్డి అప్పలనాయుడు(సాలూరు), గంటా సత్యనారాయణ (నెల్లిమర్ల), బూర రామవెంకట సత్యం (విజయనగరం), వరదా ఈశ్వరరావు(చీపురుపల్లి), కనకల రఘురామరావు (విజయనగరం), అవనాపు విజయ్ (విజయనగరం)లను పార్టీ నియమించింది.
- ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన వాకా.అప్పారావు, బి.గోవింద, అల్లు పద్మ, జి.రవికుమార్, ఈర్ల వెంకటరావు, ఒంటి అప్పారావు, ఎం.అప్పారావు, పినిశెట్టి క్రిష్టప్పదొరల, విజయనగరం నియోజకవర్గం చెందిన జి.కృష్ణంరాజు, డొంకాడ పద్మావతి, కంది రమాదేవి, బోనెల ధనలక్ష్మి, గజపతినగరం నియోజకవర్గం నుంచి కడుబండి రమేష్‌నాయుడు, ఈదుబిల్లి కృష్ణ, మహదేవు ఫణీంద్ర, తోట మధుసూదనరావు, రంభా సత్యారావు, సాలూరు నియోజకవర్గానికి చెందిన బి.అప్పారావు, రాజాం నియోజకవర్గం నుంచి లావేటి గణపతిరావునాయుడు, వంగా.శ్రీనివాసరావు, ఆదంగి గౌరినాయుడు, సాసుబిల్లి బలరామ్ నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి కె.రామారావు, పిన్నింటి వెంకటరమణ, ఎడ్ల గోవిందరావు, ఉడుపుల గురువులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిదంగా బొబ్బిలి నియోజకవర్గం నుంచి కోనారి కృష్ణ, బి.విశ్వనాథశర్మ, రాజాన చిన్నయ్యలు నియామకమయ్యారు.